క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ 11 కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ 2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అక్కిరెడ్డిపాలెం, పంచవటి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఘనంగా ముత్యమాంబ పండగ



చెట్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి రాజశేఖర్ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం గ్రామదేవత ముత్యమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే చెట్టు వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో నక్క దుర్గబాబు, పల్లా హరి, కురందాస్ వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ధర్మాల శ్రీను

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు వెంకన్నపాలెంలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ కాలువ పనులను వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను డీఈతో కలిసి గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కాలువలు ఛిద్రం కావడంతో మళ్లీ కొత్తగా నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ రంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా చేస్తామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 882వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మోదీ తొమ్మిదేళ్ల పాలనపై బీజేపీ ప్రచారం

గాజువాక: ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పాలన తొమ్మిదేళ్లు పూర్తి చేసుకోవడంపై గాజువాక బీజేపీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు పలువురు ప్రముఖులను కలిసి, తొమ్మిదేళ్లలో అందించిన పథకాలు, చేపట్టిన అభివృద్ధిపై రూపొందించిన బ్రోచర్లను అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, దీప్తి, భాగ్య, రాజశేఖర్, రామస్వామినాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం



నర్సమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుజాత

కూర్మన్నపాలెం: ప్రతీ నెలా ఒకటో తేదీ రాగానే సూరీడు కంటే ముందుగానే తలుపు తట్టి పింఛన్ అందిస్తూ.. సంక్షేమ పథకాల చేరవేతలో ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటున్న వలంటీర్ల సేవలను లబ్ధిదారులు కొనియాడుతున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో, గడప దాటి బయటకు రాలేని సమయంలో మేమున్నామంటూ ప్రతీ ఇంటికీ భరోసా కల్పించిన వారి సేవలు అమూల్యమని ప్రశంసిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అన్ని సేవలను పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకే అందిస్తున్నారని తెలియజేస్తున్నారు. రేషన్ వాహనాల నుంచి సంక్షేమ పథకాల అర్హత వరకు ఏ సమాచారమైనా తెలియజేయడం.. ధ్రువపత్రాలకు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటికే తెచ్చి ఇవ్వడం ఇలా.. ప్రతీ ఇంటికీ ఆత్మీయ బంధువయ్యారని వారి సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరోనా సమయంలో ఎంతో భరోసా



"కరోనా వ్యాప్తి సమయంలో ఎటు చూసిన మరణవార్తలే వినిపించేవి. బయటకు రావాలంటేనే భయమేసేది. కుటుంబ సభ్యులుగానీ, స్నేహితులు గానీ కనీసం పలకరించేవారు కూడా కాదు. ఆ సమయంలో వలంటీర్ జల్లి హరినాథ్ మాకు ఎంతో అండగా నిలిచాడు. మా అబ్బాయి ఉద్యోగరీత్యా వేరే రాష్ట్రంలో ఉండేవాడు, ఆ తరుణంలో సొంత కొడుకులా నన్ను, నా భర్తను చూసుకున్నాడు. కరోనా సమయంలో ప్రభుత్వం అందించిన నగదును ఇంటికి తెచ్చి ఇచ్చాడు. మా వీధిలో ఎవరికైనా కరోనా వచ్చినా వెంటనే కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించి, ఎవరూ బయటికి రాకుండా చూశారు. కరోనా కట్టడిలో వలంటీర్ల సేవలు మరువలేం."

– రమణమ్మ, దుగ్గపువానిపాలెం

ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందజేశారు

"నడుము నొప్పి, శ్వాస సంబంధిత వ్యాధి కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. పింఛన్ కోసం ఇంటికి వెళ్లలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న వలంటీర్ సుధీర్ ఆస్పత్రికే వచ్చి పింఛన్ అందించారు. పింఛన్ కోసం వేలి ముద్రలు సరిగ్గా పడలేదు. కాసేపు వేచి ఉండి, వేలిముద్రలు తీసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడే వరకు తరచూ వచ్చి పలకరించాడు. వారి సేవలకు విలువ కట్టలేం, వంక పెట్టలేం."

– నారాయణ, కణితి కాలనీ



నారాయణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుధీర్

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



రామ్ చరణ్ కోటి | పితాని ఖేజియా | బి.జె.ఎస్.అంజలి | జె.డి.నందకిషోర్ | ఇల్లపు సోనియా

- నడుపూరు హైస్కూల్ నుంచి ఇద్దరు
- కణితి హైస్కూల్ నుంచి ముగ్గురు ఎంపిక

పెదగంట్యాడ: నూజివీడు ట్రిపుల్ ఐటీలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు సీటు లభించింది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లాలో రెండో స్థానంలో నిలిచిన పితాని ఖేజియాతో పాటు రామ్ చరణ్ కోటి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

కణితి హైస్కూల్ నుంచి..

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లాలో రెండో స్థానంలో నిలిచిన బి.జె.ఎస్.అంజలికి నూజివీడు ట్రిపుల్ ఐటీలో, జె.డి.నందకిషోర్‌కు ఇడుపులపాయలో, ఇల్లపు సోనియాకు శ్రీకాకుళంలో సీటు లభించింది.

సంక్షేమ సారథి సీఎం జగన్



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రాతిపదికగా పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేశారు. వైఎస్సార్ సీపీ 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ , నాయకులు కమరున్నీసా బేగం , విరోతి రాము, పెట్ల అపారావు, కొత్తలంక సన్యాసిరావు, వెంకటేశ్వరరావు, ఆకుల ఉపమాక తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: డ్యాన్స్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ముత్యాలమ్మ పండగ సందర్భంగా గత మంగళవారం లోకల్ టాలెంట్ డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. అమ్మవారి మారుపండుగ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన పి. శ్రీను తదితరులకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, కొల్లి కుంచారావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నామాన సింహాచలం, దండు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో రోటరీ ప్రతినిధులు

గాజువాక: గాజువాక రోటరీ క్లబ్ ప్రతినిధులు పెదకొరాడ పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. రోటరీ కమిటీ సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ సుబ్బారావు (దత్త) చేతుల మీదుగా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు నక్కా లక్ష్మణరావు, విక్టర్ రాజు, విశ్వనాథం, జాన్ డీన్, సత్యవాణి, సిరట్ల శ్రీనివాస్, సత్యనారాయణ, హేమంతరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బాధిత కుటుంబానికి బీమా సొమ్మును అందజేస్తున్న గౌస్

గాజువాక: జీవీఎంసీ 66వ వార్డు సీతానగరానికి చెందిన గొలగాని రమణమ్మ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా నగదును వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ గురువారం అందజేశారు. రమణమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమెకు రూ.1 లక్ష మంజూరు కాగా, తక్షణ సాయం కింద ఆమె కుటుంబ సభ్యులకు రూ.10వేలను అందజేశారు. బాధిత కుటుంబానికి, వారి పిల్లలకు చదువుపరంగా అండగా ఉంటామని గౌస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికులకు వేతనాలు పెంచాలి



శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవన్ రెడ్డి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన కార్మికులను మళ్లీ చేర్చుకోవాలని, 29 మంది కార్మికులపై విధించిన ఆంక్షలను ఎత్తి వేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు శిబిరం వద్ద కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు యువశ్రీ, రోజారాణి, బొడ్డ గోవింద్ తదితరులున్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



సరకులను పంపిణీ చేస్తున్న డాక్టర్ పూర్ణేంద్రబాబు తదితరులు

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీబీ చికిత్స పొందుతున్న 50మందికి లుపిన్ ఫార్మా కంపెనీ పౌష్టికాహారం పంపిణీ చేసింది. నెలకు సరిపడా సమకూర్చిన ఈ సరకులను జిల్లా అదనపు వైద్య శాఖాధికారి డాక్టర్ సీహెచ్.పూర్ణేంద్రబాబు చేతులమీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కిట్‌లో కిలో గోధుమపిండి, కిలో రాగిపిండి, కిలో బెల్లం, కిలో కందిపప్పుతో పాటు ఇతర పౌష్టికాహారానికి సంబంధించిన సరకులను లుపిన్ ఫార్మా సమకూర్చిందన్నారు. ఈ సరుకులను పూర్తిగా పేషెంట్ మాత్రమే వినియోగించాలని సూచించారు. ట్రీట్‌మెంట్ పొందుతున్న రోగులకు ఆరు నెలలపాటు సరకులను ప్రతి నెలా మొదటి వారంలో అందజేస్తామని తెలియజేశారు. మందులను సక్రమంగా తీసుకుంటూ, పౌష్టికాహారాన్ని వినియోగించినవారు టీబీ నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్, లుపిన్ ఫార్మా సైట్ హెడ్ కె.రాజేష్, డీజీఎం (హెచ్ఆర్) ఎన్.శ్రీనివాసరావు, సీఎస్సార్ మేనేజర్ వెంకట్, ఫ్యాక్టరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరం



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. కాలువలు, గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. కాలువలు గెడ్డలు పరిశీలించి, అందులో చెత్త, పూడిక పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

స్నేక్‌క్యాచర్ కిరణ్‌కుమార్‌కు పాము కాటు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్

ఉక్కునగరం: నిత్యం పాములతో ఆడుకునే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు పాము కాటు తప్పలేదు. పెద్ద కోబ్రాలను, విష పాములను పట్టుకున్న ఆయన పాము పిల్లను పట్టు కునే ప్రయత్నంలో కాటుకు గురయ్యాడు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగంలో ఐదు రోజుల క్రితం పెద్ద నాగుపామును పట్టుకున్న కిరణ్ కుమార్ బుధవారం అదే విభాగంలో ఉన్న 18 నాగుపాము పిల్లలను పట్టుకున్నారు. కిరణ్ సేవలను ప్రశంసిస్తూ విజిలెన్స్ విభాగం గురువారం ఉదయం ఆయన్ను సత్కరించింది.జీఎం వేణు ప్రశంసాపత్రం అందజేశారు. కొద్దిసేపటికి మరో పాము పిల్ల ఉన్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ విభాగానికి వెళ్లారు.దానిని పట్టుకునే ప్రయత్నంలో అప్పటికే కోరలు తెరిచి ఉన్న పాముపిల్ల కిరణ్‌కుమార్ చేతి ఉంగరం వేలుపై కాటు వేసింది. వెంటనే ఆయన అగనంపూడి ఆసుపత్రికి వెళ్లి,కొన్ని ఇంజక్షన్లు తీసుకుని, వైద్యుల సూచనల మేరకు కేజీహెచ్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు.

కబడ్డీ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



కబడ్డీ శిక్షణను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డులోని భానోజీ తోటలో ఏజే వారియర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కబడ్డీ ఉచిత శిక్షణ తరగతులను కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రికెట్ తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన కబడ్డీలో చక్కటి శిక్షణ పొంది, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే నైపుణ్యాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం సంఘం ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, కోచ్‌లు జయ, అంజని, సభ్యులు లక్ష్మణరావు, భూలోక, అప్పలరాజు నాయకులు లోకనాథం, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హిమాలయ యాత్ర పూర్తి చేసుకున్న గురుస్వామికి సత్కారం



గురుస్వామి వెంకటరమణ బృందాన్ని సన్మానిస్తున్న అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: హిమాలయాల్లోని సతోపంత్ స్వర్గారోహిణి యాత్ర పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన షీలానగర్ స్వామి అయ్యప్ప సేవాసంఘం గురుస్వామి అదపాక వెంకటరమణను అయ్యప్ప సేవాసంఘం ప్రతినిధులు విశాఖ విమానాశ్రయంలో గురువారం ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. గురుస్వామి వెంకటరమణ మాట్లాడుతూ బద్రీనాథ్ నుంచి సతోపంత్ స్వర్గారోహిణికి చేరుకున్నామని, తదుపరి కురుక్షేత్రం నుంచి హరిద్వార్ వెళ్లామని, అనంతరం బద్రీనాథ్‌లో నారాయణుడిని దర్శించుకున్నామని తెలిపారు. హిమాలయాల్లో 14 రోజుల పాటు పలు దేవాలయాలను సందర్శించినట్లు చెప్పారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్సులు చెల్లించాలి

ఈడీ వర్క్స్ బిల్డింగ్ వద్ద కార్మిక సంఘాల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను గతంలో వలే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద గురువారం ధర్నా చేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అలవెన్సులపై ఈఎస్‌ఐ చెల్లించాలన్న ఈఎస్‌ఐ అధికారుల ఆదేశాలతో, కాంట్రాక్టర్లు కార్మికులకు అలవెన్సులను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అంశం యాజమాన్యంతో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే పూర్వ పద్ధతిలో అలవెన్సులు చెల్లించాలని కోరారు. అనంతరం హెచ్‌ఆర్ జీఎం బినయ్ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కొవిరి అవతారం, ఉమ్మిడి అప్పారావు, పిట్టా రెడ్డి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



రాజీవ్‌నగర్‌లో నిబంధనలను అతిక్రమించి కట్టిన నిర్మాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



వడ్లపూడిలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

కూర్మన్నపాలెం: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై జీవీఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపారు. జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని నాలుగు భవనాలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతికేకంగా నిర్మిస్తున్నారని కొద్ది రోజులుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఏసీపీ మహాపాత్రో పరిశీలించి, నిబంధనలు అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. నిరంతరం నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరి దుర్మార్గం



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న రామస్వామి

ఉక్కునగరం: అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంబిస్తోందని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. గంగవరం పోర్టు కార్మికులకు సంఘీభావం తెలుపుతూ స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు పరిపాలన భవనం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్కడి కార్మికులను యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. అక్కడి విషయాలను కలెక్టర్‌కు విన్నవించినా, రాజకీయ పార్టీలు చర్చలు జరిపినా .. వారి ఆదేశాలను, సూచనలను యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ గంగవరం ప్రజలు తమ ఉపాధిని, నివాసాలను పోర్టు కోసం త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలను యాజమాన్యం నేడు అపహాస్యం చేస్తోందన్నారు. యాజమాన్యం మొండి వైఖరికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఏకమై ఉద్యమించాలన్నారు. అధ్యక్షుడు వై.టి. దాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, బి. అప్పారావు, కె. గంగాధర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాత్‌వే విస్తరించాలని డీఆర్‌ఎంకు వినతి



డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ పరిధిలోని మూడు వార్డులు, 20వేల మంది జనాభాకు ఉపయోగపడే తలారివానిపాలెం అండర్ పాత్ వేను విస్తరించాలని కోరుతూ అగనంపూడికి చెందిన అఖిలపక్షాల నాయకులు డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతికి గురువారం వినతిపత్రం అందించారు. 79, 85, 88 వార్డుల్లోని అగనంపూడి, దువ్వాడ, ఫార్మాసిటీ కాలనీ, మంగళపాలెం, జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, సబ్బవరం శివారు గ్రామాలకు సమీప మార్గంగా ఉన్న తలారివానిపాలెం అండర్ పాత్‌వేను విస్తరించాలని వినతిపత్రంలో కోరారు. ప్రస్తుతం మూడడుగుల వెడల్పులో ఉన్న దారి వల్ల కేవలం పాదచారుల రాకపోకలకు మాత్రమే వీలుగా ఉందని, అండర్ బ్రిడ్జ్ లేదా ఫ్లై ఓవర్ వంతెన నిర్మిస్తే వాహనాల రాకపోకలకు అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు. డీఆర్‌ఎంను కలిసిన వారిలో నాయకులు తోకాడ రాము, కొలిపాక అప్పారావు, మోటూరి వెంకటరమణ, డి.వి.అప్పారావు, మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట

అగనంపూడి: రాతపూర్వక హామీ ప్రకారం సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెకు వెనుకాడబోమని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. అగనంపూడిలో గురువారం నిర్వహించిన 85వ వార్డు కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాక జోన్ పరిధిలో పని చేస్తూ, మరణించిన ఉద్యోగుల ఖాళీలు 60 వరకు ఉన్నాయన్నారు. వాటితో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల స్థానంలో నియామకాలు చేపట్టాల్సి ఉందన్నారు. గత నెల 19న కార్మికులు సమ్మెకు సిద్ధమైతే, ఆ సమయంలో అధికారులు టైమ్ బాండ్ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించామని తెలిపారు. అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేస్తుండడం సరి కాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సత్యవతి, నాగమణి, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.